క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

కంకిపాడు: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉప్పలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ అన్నారు. కొణతనపాడు ఎంపీపీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సుందర్‌కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని సూచించారు. పోషకాలతో కూడిన ఆహారాన్ని భుజించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కుసుమ, ఏఎన్‌ఎం ప్రశాంతి, ఆశ కార్యకర్తలు సరిత, గంగమ్మ, వాణి, హెచ్‌ఎం వి.నాగరాజు పాల్గొన్నారు.

నేడు నున్నలో మెగా వైద్యశిబిరం

నున్న(విజయవాడరూరల్): ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వారితో అధునాతన మెగా వైద్య సేవా శిబిరం ఆదివారం నున్న గ్రామంలోని వెలగపూడి అపార్ట్‌మెంట్ల వద్ద జరుగుతుందని ఆస్పత్రి గౌరవ చైర్మన్ రజనీకాంత్ శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో బీపీ, సుగర్‌తో పాటు ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలపై వైద్యులు పరీక్షలు చేస్తారని ఆయన తెలియజేశారు. నున్న, పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో శనివారం పారిశుద్ధ్య సిబ్బంది.. చెత్తను తొలగించి, సైడు డ్రెయిన్లను పూడిక తీయించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు తెలిపారు. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లను గుర్తించి పూడిక తీయిస్తున్నామన్నారు. గ్రామంలో అవసరమైన ప్రాంతాల్లో డ్రెయిన్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

నా భూమి-నాదేశం శిలాఫలకాలు ఏర్పాటు

ఉంగుటూరు: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో భాగంగా ప్రతి గ్రామంలో నా భూమి-నా దేశం, నేలతల్లికి నమస్కారం-వీరులకు వందనం శిలాఫలకాలను ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. పొణుకుమాడులో గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో నా భూమి-నా దేశం శిలాఫలకం ఏర్పాటును ఎంపీడీవో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శిలాఫలకాలను ఏర్పాటు చేసి వాటిపై స్థానిక వీరులు, విధి నిర్వహణలో ప్రాణాలు పోగొట్టుకున్న ఆర్మీ, సాయుధ, నౌకా, వైమానిక దళాలకు చెందిన వారి పేర్లతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామంలో దీర్ఘకాలం ఉండే 75 మొక్కలను నాటాలని సూచించారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



కంకిపాడు: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కంకిపాడు సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఈడుపుగల్లు నలంద విద్యానికేతన్‌లో శనివారం నాయకత్వ ప్రతిష్ఠాత్మక ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అవసరమన్నారు. లక్ష్య సాధనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. విద్యతోపాటు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రావీణ్యం పొందాలన్నారు. హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డెప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్, క్లాస్ మానిటర్స్‌కు బ్యాడ్జీలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. 2023-24 స్టూడెంట్ కౌన్సిల్‌ను విద్యాసంస్థల అధినేత విజయబాబు అభినందించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జె. పద్మావతి పర్యవేక్షించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

ఒకరికి గాయాలు

పెనమలూరు: కృష్ణా కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు కరకట్ట ప్రాంతానికి చెందిన లంకపల్లి నాగరాజు కానూరు కోల్డ్ స్టోరేజీలో పని చేస్తాడు. అతను నూడుల్స్ కొనడానికి బైక్‌పై కరకట్ట ఇంటి వద్ద నుంచి వెళ్తున్నాడు. అతన్ని కరకట్టపై వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఘటనలో అతనికి గాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్న పాలనలో సామాజిక న్యాయం

- నవరత్నాలతో ప్రజల అభివృద్ధి
- ఎన్నికలకు క్యాడర్ సిద్ధం కావాలి
- ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి, నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

పెనమలూరు: జగనన్న పాలనలోనే సామాజిక న్యాయం జరిగిందని, నవరత్నాల సంక్షేమ పథకాలతో అట్టడుగు వర్గాల ప్రజలు అభివృద్ధికి నోచుకున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమావేశం శనివారం కానూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్థసారథి మాట్లాడుతూ వైఎస్సార్ పాలనలో సంక్షేమ పథకాలతో పేదల అభివృద్ధికి పునాది వేశారని గుర్తు చేశారు. జగనన్న అధికారం చేపట్టిన తర్వాత పేదల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేసి సామాజిక న్యాయం చేశారని తెలిపారు. నేడు రాష్ట్రంలో పేద కుటుంబాలు ప్రగతిబాటలో ఉన్నాయని వివరించారు.

పెనమలూరులో అభివృద్ధిపై చర్చకు సిద్ధం

రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదని టీడీపీ ఇదేం ఖర్మ కార్యక్రమం చేస్తోందని, పెనమలూరులో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే పార్థసారథి సవాల్ చేశారు. గత మార్చి నాటికి నియోజకవర్గంలో పేదల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం రూ.1,590 కోట్ల సొమ్ము జమచేసిందన్నారు. నియోజకవర్గంలో రూ.33 కోట్లతో ఐదు ఆస్పత్రుల నిర్మాణం చేస్తున్నామన్నారు. కాలువ కట్టలపై సిమెంట్ రోడ్లు వేసి అనేక మౌలిక వసతులు సమకూర్చామని చెప్పారు. ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మించామని తెలిపారు. గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలు, పాఠశాలల భవనాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారని చెప్పారు. ఇంత అభివృద్ధి చేస్తే టీడీపీకి ఎందుకు కనిపించడం లేదో ఆ పార్టీ నేతలు చెప్పాలన్నారు.

ఎన్నికల శంఖారావం పూరించాలి

కొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికలకు పార్టీ నేతలు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే పార్థసారథి పిలుపునిచ్చారు. పెనమలూరు ఏఎంసీ కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం సాయంత్రం కంకిపాడులో జరుగుతుందన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎన్నికల శంఖారావం పూరించాలన్నారు. పార్టీలో అన్ని వర్గాలకు పదవులు వస్తాయని, ఇప్పుడు రానివారికి వచ్చే టర్మ్‌లో పదవులు వరిస్తాయన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్ మాట్లాడుతూ పార్టీ క్యాడర్‌కు ఏ సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. తాను అన్ని వేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. జగనన్నను తిరిగి సీఎంను చేసే వరకు పార్టీక్యాడర్ పట్టుదలతో పని చేయాలని తెలిపారు. సమావేశంలో ఉయ్యూరు నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని నాని, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు పి.రాఘవరావు, నక్కా శ్రీనివాసరావు, బిందుమాధవి, వైఎస్సార్ సీపీ నేతలు అన్నే చిట్టిబాబు, వెలగపూడి వరప్రసాద్, గుమ్మడి విజయ్‌కుమార్, ఆదిశేషారావు, అక్బర్‌పాషా, అన్నేశ్రావణ్, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, చాంద్‌బాషా, సిద్ధిఖ్, క్రిస్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఆరాటం

కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్



కంకిపాడు: రాజకీయ లబ్ధి, స్వలాభం కోసమే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రయత్నిస్తున్నారని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) విమర్శించారు. ఆయన శనివారం కంకిపాడులో విలేకరులతో మాట్లాడారు. కుప్పం, పులివెందుల, పుంగనూరు ఘటనలు చూస్తే మనసు కలిచివేస్తోందన్నారు. కుయుక్తులు పన్నటం, సంక్షేమ ప్రభుత్వంపై బురదచల్లటం 14 ఏళ్ల సీఎం అనుభవం ఉన్న చంద్రబాబుకే చెల్లిందని విమర్శించారు. పోలీసుల అనుమతి లేని రూట్‌లో సాగుతున్న పర్యటనను అడ్డుకుంటే గొడవలు సృష్టించి సానుభూతిని పొందేందుకు దిగజారుడు రాజకీయానికి చంద్రబాబు తెరతీశారని ఆరోపించారు. పుంగనూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై బురద చల్లేందుకు చంద్రబాబు చేసిన కుట్రే పుంగనూరు ఘటన అని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో అధికారం పొందేందుకు నీచ రాజకీయాలు చేస్తున్నారని, చంద్రబాబు కలలు కల్లలుగానే మిగులుతాయన్నారు. సొంత జిల్లాకు నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేయలేని దద్దమ్మ చంద్రబాబు అని ధ్వజమెత్తారు. రియల్ఎస్టేట్ వ్యాపారుల అడుగులకు మడుగుల ఒత్తి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించింది చంద్రబాబే అని విమర్శించారు. పేదల పక్షాన నిలబడ్డ సంక్షేమ పాలకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ తన ధోరణి మార్చుకోకపోతే గతంలో వచ్చిన 23 సీట్లు కూడా రాకపోవచ్చని చెప్పారు. లోకేష్‌కు రాజకీయ భవిష్యత్తు కూడా ఉండదని, రాజకీయాల్లో ఎందుకూ పనికిరాకుండా పోతాడని చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు



ఉయ్యూరు 20వ వార్డులో సంక్షేమ పథకాల బ్రోచర్లను అందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డిదేనని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించి సంక్షేమ పథకాల బ్రోచర్లను అందించారు. వార్డులో ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. స్థానికులు రేషన్‌కార్డులు, డ్రెయినేజీ, టిడ్కో ఇళ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఆ శాఖల అధికారులకు సూచించారు. పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల ద్వారా ప్రజలకు నరకాన్ని చూపారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక విధానాన్ని తీసుకొచ్చి అర్హతే కొలమానంగా సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, కౌన్సిలర్‌లు గోన మదన్, గుంజా సుధాకర్‌బాబు, డాక్టర్ జంపాన పూర్ణిమ, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పునర్నిర్మాణ పనులు

మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో కమ్యూనిటీ హాలు పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించారు. పాత కమ్యూనిటీహాలు స్థానంలో కొత్త హాలు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు శనివారం ఎమ్మెల్యే పార్థసారథి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నులి పురుగుల నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించాలి



నులిపురుగుల నిర్మూలన టాబ్లెట్లు అందజేస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత

విజయవాడరూరల్: నులి పురుగుల నుంచి విద్యార్థులకు రక్షణ కల్పించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత అన్నారు. ఈ నెల 10వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఏఎన్‌ఎం, ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ అమృత మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన టాబ్లెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఆమె మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా రక్తహీనత సమస్య ఉంటుందని, ఆకలి మందగించడం, బరువు తగ్గడం లాంటివి గమనించవచ్చునన్నారు. వెలగలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రవికాంత్ మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనపై వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు, ఎంపీహెచ్‌ఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉయ్యూరు: విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలు విధిగా వేయాలని కాటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి దీప కోరారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఉయ్యూరు పట్టణం, మండలంలోని 11 గ్రామాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు శనివారం నులి పురుగు నివారణ మాత్రలను అందించారు. డాక్టర్ దీప మాట్లాడుతూ మండలంలో 2,657 మంది విద్యార్థులకు 2,780 మాత్రలు పంపిణీ చేశామన్నారు. డీ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు మాత్రలు అందిస్తున్నామని చెప్పారు. చిన ఓగిరాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ అనిల్, ఎంఈఓ సుధారాణి పాల్గొన్నారు.

గన్నవరం: పిల్లల్లో నులి పురుగుల నివారణకు అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఎంపీపీ అనగాని రవి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న జరగనున్న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమం కోసం శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ...పిల్లల విద్య, ఆరోగ్యం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా నులి పురుగుల నుంచి రక్షణ కోసం విద్యార్థులందరికీ ఉచితంగా నివారణ మాత్రలు అందజేస్తున్నట్లు తెలిపారు. నోడల్ ఆఫీసర్ శాస్త్రి మాట్లాడుతూ...ఈ నెల 10వ తేదీన ప్రతి పాఠశాలలో మాత్రలు పంపిణీ చేయాలని, ఆరోజు పాఠశాలకు రాని విద్యార్థులకు 17వ తేదీ అందజేయాలని తెలిపారు. ఎంపీడీవో సత్యకుమార్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైద్యులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలను ఎంపీడీవో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సాంబశివరావు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక మహాత్మాగాంధీ నగర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో చిన్నారుల్లో నులిపురుగుల నివారణపై ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంఈవో బాల రామసింగ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్ సర్పంచ్ సరిపల్లి కమలాభాయి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల నివారణకు దోమల వ్యాప్తిని అరికట్టాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: దోమల వ్యాప్తిని ఆరికట్టేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని జిల్లా మలేరియా విభాగం అధికారి బి.రామారావు అన్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరులో డెంగీ కేసు నమోదైన నేపథ్యంలో శనివారం జిల్లా మలేరియా విభాగం అధికారి రామారావు, రాష్ట్ర కన్సల్టెంట్ వి.మనోజ్‌కుమార్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న ఫీవర్ సర్వే, దోమల నిర్మూలన చర్యల గురించి ఆరా తీశారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలు రాకుండా పాటించాల్సిన ముందు జాగ్రత్తలను గూర్చి వివరించారు. బాపులపాడు పీహెచ్‌సీ వైద్యుడు నారయ్య, సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

బాలికా రక్షణకు ప్రభుత్వం విశేష కృషి

గన్నవరంరూరల్: బాలికల రక్షణకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక కాలనీలో శనివారం బాలికల రక్షణపై గ్రామస్తులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ 1098 నంబర్‌ను ఉపయోగించుకోవాలని చెప్పారు. బాలికలు ఆపద సమయంలో ఈ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

గన్నవరంరూరల్: పరిసరాల పరిశుభ్రతపై గ్రామంలో నిరంతరం సర్వే నిర్వహించటం ద్వారా రోగాలను దూరం చేయాలని గోపవరపుగూడెం సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో శనివారం ముస్తాబాద పీహెచ్‌సీ సీహెచ్‌వో మెర్సీ, ఆరోగ్య సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఆరవ విడత సర్వేకి గోపవరపుగూడెం ఎంపికైందని, త్వరలో సెంట్రల్ టీమ్ సర్వేకు వస్తుందని, ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులను పరిశుభ్రతపై, ఆరోగ్య రక్షణపై చైతన్యవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వి రేణు రాజ్యం, ఏఎన్‌ఎంలు సుమతి, హరిత, ఎంఎల్‌హెచ్‌పీ రాణి, ఎంపీహెచ్ఈఏ సాంబశివరావు, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జన్మనక్షత్ర పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జన్మనక్షత్రం పూర్వభాద్రను పురస్కరించుకుని శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దాత అల్లూరి రమేష్, సుధా దంపతుల వితరణతో భక్తులకు అన్నదానం చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈవో కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



పునాదిపాడు-2 సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

కంకిపాడు: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామ పరిధిలో నిర్మించిన సచివాలయ భవనం -2 శనివారం ఎమ్మెల్యే పార్థసారథి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని జగనన్న లే అవుట్‌ను సందర్శించారు. కాలనీలో కల్పించిన వసతులు, ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ పాలన క్షేత్రస్థాయికి తీసుకొచ్చేలా సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం తెచ్చిందన్నారు. జగనన్న లే అవుట్‌లో అంతర్గత రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు మరింత వేగంగా పూర్తి కావాలన్నారు. గృహ నిర్మాణం పూర్తైన లబ్ధిదారులు త్వరలోనే గృహప్రవేశాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిబోయిన విజయకుమారి, ఎంపీపీ రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ బాకీ బాబు, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, ఎంపీటీసీ మార్తమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, నాయకులు మునిబోయిన వెంకటేశ్వరరావు, పిడికిటి రామకోటేశ్వరరావు, ఈఓ బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణస్వీకారం

కంకిపాడు: పెనమలూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఈ నెల 6వ తేదీ ఆదివారం కంకిపాడు బస్టాండు సెంటరులో నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కంకిపాడు మార్కెట్ యార్డులోని మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతలు చేపట్టనుంది. సాయంత్రం 5 గంటలకు బస్టాండు సెంటరులో పాలకవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా జరిగే ర్యాలీ, ప్రమాణస్వీకార సభలను విజయవంతం చేయాలని ఏఎంసీ వైస్ చైర్మన్ మాదు వసంతరావు విజ్ఞప్తిచేశారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గన్నవరం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పలువురు తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శనివారం పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. తొలుత గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి విద్యార్థులు క్రీడా ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్తచెదారం తొలగించారు. సంఘ కార్యదర్శి దేవరపల్లి విక్టర్‌బాబు, చిల్లపల్లి శ్రీనివాసరావు, ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దంతాల సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం

కంకిపాడు: దంతాల సంరక్షణతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని దంత వైద్య నిపుణుడు డాక్టర్ వణుకూరు ప్రవీణ్ అన్నారు. గోసాల జె.డి. డెంటల్ క్లినిక్ ఆధ్వర్యాన మద్దూరు గ్రామ పంచాయతీలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరాన్ని సర్పంచ్ చిప్పల రామదాసు, ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు ప్రారంభించారు. దంత వైద్యులు డాక్టర్ శిల్పా శర్వాణి శెట్టి, డాక్టర్ సీహెచ్ అనూష, డాక్టర్ సీహెచ్ హదస్సా దంత పరీక్షలు చేశారు. 100 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ఉచిత దంత వైద్య శిబిరం ఈ నెల 6వ తేదీ కూడా కొనసాగుతుందని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

110 మందికి కంటి పరీక్షలు



కంకిపాడు: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి. రాజేష్ కుమార్ అన్నారు. ప్రొద్దుటూరు పంచాయతీ శివారు కొణతనపాడు గ్రామంలో శనివారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 60 ఏళ్లు దాటిన 110 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. శుక్లాల ఆపరేషన్ అవసరమైన వృద్ధులను గుర్తించి శస్త్రచికిత్సకు రిఫర్ చేశారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ కళ్లకు సోకే వ్యాధుల నుంచి రక్షణ పొందడానికి ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వ్యక్తి కనిపించకపోవడంపై కేసు

పెనమలూరు: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన గ్రంధి పురుషోత్తమరావు కార్ల వ్యాపారి. అతను కార్లు కొనటానికి రాజమండ్రికి వెళుతున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు తెలిపి గత నెల 31వ తేదీన మొగల్రాజపురంలో ఉంటున్న మొహిందర్ వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి ఇద్దరు బయలుదేరి యనమలకుదురు కరకట్ట వద్ద ఉన్న మద్యం షాపునకు చేరుకున్నారు. అర్ధరాత్రి వరకు మద్యం సేవించిన తర్వాత పురుషోత్తమరావు తనకు పని ఉందని వెళ్లి పోయాడు. అయితే అతను ఇంటికి చేరలేదు. అతని కుటుంబ సభ్యులు పలుచోట్ల వెదికినా ఫలితం లేదు. అతని సోదరుడు నాగేశ్వరరావు ఫిర్యాదుపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యం

కంకిపాడు: మహిళ అదృశ్యంపై స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కంకిపాడు పట్టణానికి చెందిన కె.చిట్టిబాబుకు రెండు పెళ్లిళ్లు జరిగాయి. మొదటి భార్యకు కుమార్తె, కుమారుడు సంతానం ఉన్నారు. రెండో భార్యకు కుమార్తె, కుమారుడు సంతానం. మొదటి భార్య సంతానమైన ఆడపిల్లకు వివాహం చేయగా, కుమారుడికి వివాహం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీనిపై రెండో భార్య కె.వెంకమ్మ అలియాస్ లక్ష్మి భర్త చిట్టిబాబుకు మధ్య విబేధాలు ఏర్పడ్డాయి. తాను, తన పిల్లలు అవసరం లేదా, మొదటి భార్య పిల్లల్ని చూసుకుంటావా? అంటూ గొడవ జరిగింది. ఈ నెల 3వ తేదీన వెంకమ్మ అలియాస్ లక్ష్మి ఇల్లు విడిచి వెళ్లిపోయింది. స్థానికంగా విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేశారు.